

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.26

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.3°/22.6°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపు 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీల స్థితిని 1100 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలిపారు.

ఇన్‌చార్జ్ వీసీగా ఏడాది పూర్తి



ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు అభినందనలు తెలుపుతున్న రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ బి. అనిత పదవి చేపట్టి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఆమెను శనివారం వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ ఆంజినేయులు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అభినందించారు. కాగా..ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా ఏడాది పాటు బాధ్యతలు నిర్వర్తించిన తొలి వ్యక్తిగా అనిత గుర్తింపు పొందారు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి బాధ్యతలతో వీసీ నియామకాన్ని ఏడాదిగా జాప్యం చేస్తూ వస్తున్న విషయం విదితమే.

విద్యార్థినికి విషపురుగు కాటు



ఆస్పత్రిలో విద్యార్థిని ధనశ్రీ

ఉరవకొండ: విషపురుగు కాటుతో విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటన ఉరవకొండలో జరిగింది.వివరాలు.. స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ధనశ్రీ శనివారం పాఠశాలలో ప్రార్థన చేస్తున్న సమయంలో ఉన్నట్లుండి కింద పడింది. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏమైందని ఆరా తీయగా.. తనకు ఏదో కుట్టిందని చెప్పింది. దీంతో టీచర్లు వెంటనే ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ధనశ్రీది వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండా గ్రామం కాగా, ఉరవకొండలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటోంది.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



హెచ్చెల్సీలో గంగపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తదితరులు

బొమ్మనహాళ్: రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం బొమ్మనహాళ్ సమీపంలోని హెచ్చెల్సీలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, టీబీ డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్, ఆయకట్టు రైతులు గంగపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ జిల్లాకు జీవనాడి అయిన తుంగభద్ర ఎగువ కాలువకు ఎప్పుడూ లేని విధంగా జూలై 20లోపే నీటిని తీసుకొచ్చి హారతి ఇచ్చామన్నారు. టీబీ డ్యాంలో ఈ ఏడాది కొత్త గేట్లు అమర్చబోతున్నారని, ఈ క్రమంలో నీరు ముందుగానే బంద్ అయ్యే అవకాశాలున్నాయన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా ఆ మేరకు పంటలను సాగు చేసుకోవాలన్నారు. గత ఏడాది బచావత్ అవార్డు ప్రకారం నీటిని తీసుకొని చరిత్ర సృష్టించామన్నారు. తక్కువ సమయంలో హెచ్చెల్సీలో అత్యవసర మరమ్మతు పనులు చేయించామన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి, జేఈలు రంజిత్ కుమార్, అల్తాఫ్, తుంగభద్ర పాజెక్టు వైస్ చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్య కలవరం!

- హిందూపురం పట్టణానికి చెందిన నరేష్ ఎస్‌బీటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అమెరికాలోని బోస్టన్ వర్సిటీలో ఎంఎస్ సీటు వచ్చింది. అయితే, అక్కడకు వెళ్లేందుకు వీసా స్లాట్ కేటాయించలేదు. దీంతో నరేష్ రోజూ కళ్లకు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నాడు.
- అనంతపురం శారదానగర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి కర్ణాటకలోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో ఇతనికి సీటు వచ్చింది. కానీ వీసా కోసం పడరాని పాట్లు పడుతున్నాడు. వీరిద్దరే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంతో మంది విద్యార్థులు ఇదే సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



- గతంలో ఉమ్మడి జిల్లా నుంచి 300 మందికి పైగా విదేశాలకు..
- ఈ ఏడాది వీసా కష్టాలతో 40 మందికి మించని వైనం
- వీసా స్లాట్‌ల కోసం ఎదురుచూపులు
- కొంతమందికి ఇప్పటికే లోన్ల మంజూరు
- మంచి యూనివర్సిటీల్లో సీటు వచ్చినా వీసా రాక పాట్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థుల 'కల' చెదిరింది. విదేశాలకు వెళ్లి చదువుకోవాలన్న కోరిక నెరవేరడం లేదు. ఇంజినీరింగ్ పూర్తి చేసి విదేశాల్లో ఎంఎస్ కోసం ఈ ఏడాది ఉమ్మడి జిల్లా నుంచి 800 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్టు ప్రాథమిక అంచనా. కానీ ఇప్పటివరకూ పట్టుమని 40 మందికి కూడా వీసాలు రాలేదని తెలుస్తోంది. వివిధ కన్సల్టెన్సీలు, ఎడ్యుకేషనల్ సంస్థలు ఇచ్చిన సమాచారం మేరకు ఈ ఏడాది పదుల సంఖ్యలోనే విద్యార్థులకు అవకాశం వచ్చినట్టు వెల్లడైంది. ఇంజినీరింగ్‌తో ఇక్కడ ఉద్యోగం రాక, అమెరికాలో ఎంఎస్ చదవడానికి అవకాశం లేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పడరాని పాట్లు..

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక విదేశీ విద్యార్థులకు నిబంధనలు కఠినతరం చేసిన విషయం తెలిసిందే. దీంతో మన విద్యార్థులకు ఇబ్బంది ఎదురవుతోంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థులకు మంచి యూనివర్సిటీల నుంచి ఆమోదం లభించింది. ఇందుకు సంబంధించి ఐ-20 ఫాంలు వచ్చాయి. వీటి ఆధారంగానే వీసా ఇంటర్వ్యూకు వెళతారు. కానీ వీసా స్లాట్‌లు కేటాయించకపోవడంతో రేయింబవళ్లు ఎదురు చూస్తున్నారు. అమెరికాలో మెజారిటీ యూనివర్సిటీలు ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 20 లోపు తరగతులు ప్రారంభిస్తాయి. ఐ- 20 ఆధారంగా ఇప్పటికే బ్యాంకు లోన్లు మంజూరు చేశారు. వీసా ఇంటర్వ్యూ ఆమోదం లభిస్తే చాలు వెళ్లిపోవాలని ఆలోచన. కానీ వీసా స్లాట్‌లు లభించకపోవడంతో విదేశాలకు వెళ్లాలనే కల నెరవేరడం లేదు. ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాల్లో అవకాశాలున్నా రకరకాల కారణాలతో అక్కడకు వెళ్లే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది.

విదేశీ విద్యకు రాయితీ ఏదీ..?

గత ప్రభుత్వ హయాంలో 'జగనన్న విదేశీ విద్యా దీవెన' కింద 50 శాతం నుంచి 100 శాతం వరకూ ఫీజు రాయితీ పొందిన అభ్యర్థులున్నారు. వరల్డ్ క్యూఎస్ ర్యాంకింగ్స్‌ను బట్టి రాయితీ ఇచ్చారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక విదేశీ విద్యకు రాయితీలు తొలగించడంతో పేద విద్యార్థులు విదేశాల్లో చదివే అవకాశం కోల్పోతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితి ఇలా

2023-24లో అమెరికాకు వెళ్లిన విద్యార్థులు	400 మందికి పైగా
ఈ ఏడాది దరఖాస్తు చేసుకున్న వారు	800 మందికి పైగా (అంచనా)
ఇప్పటివరకూ వీసాలు వచ్చినది	40 మందికి మాత్రమే
ఐ 20లు వచ్చిన వారు	350 మందికి పైగా

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నార్పల: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఇప్పటికే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేశామని, ఇకపై గ్రామాల్లో కూడా అమలు చేస్తామని చెప్పారు. చెత్త ప్రాసెసింగ్‌పై దృష్టి పెడుతున్నామన్నారు. జిల్లాను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం రైతు రామాంజినేయులు గోకులం షెడ్ ప్రారంభించి, పశుపోషణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీటి ఇంకుడు గుంతలకు,గ్రామ ప్రాథమిక పాఠశాలలో రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. క్లాప్ మిత్రలు, సర్పంచును సన్మానించారు. ఇంటింటికీ క్లాత్ బ్యాగ్‌లు, చెత్త బుట్టలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.కోటిన్నర చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, సర్పంచు ఆలం శిరీష, ఉప సర్పంచు ఆలం వెంకట నరసానాయుడు, డీపీఓ నాగరాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జికి ఘన స్వాగతం

అనంతపురం: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్‌కు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఘన స్వాగతం పలికారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌ను ఆర్అండ్‌బీ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలెక్టర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా జేసీ అభిషేక్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ కూడా ఉన్నారు.

- అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీలు పి. జగదీష్, వి. రత్న కూడా జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



మర్యాద పూర్వకంగా భేటీ అయిన అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీలు జగదీష్, రత్న

హెచ్చెల్సీ ఇన్‌చార్జ్ ఎస్ఈగా సుధాకర్‌రావు


అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ ఇన్‌చార్జ్ ఎస్ఈగా సుధాకర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇరిగేషన్ సర్కిల్ డీఎస్ఈగా పనిచేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది వరకు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి హెచ్చెల్సీ ఇన్‌చార్జ్ ఎస్ఈగా వ్యవహరించారు.



శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉద్యోగులు

మిథున్‌రెడ్డి అరెస్టు కక్ష సాధింపులో భాగమే

- బాబు రాజకీయ జీవితమంతా కుట్రలే
- భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత' ధ్వజం



అనంతపురం కార్పొరేషన్: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సన్నిహితంగా ఉంటున్నారనే ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కూటమి పాలనలో కక్ష సాధింపులు తారస్థాయికి చేరాయన్నారు. భవిష్యత్తులో సీఎం చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఉద్యోగులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకున్నారని ఆరోపించారు. అక్రమ కేసులో మిథున్ రెడ్డిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలతోనే సాగుతోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండడంతోనే వైఎస్సార్ సీపీలోని కీలక నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2014-19 పాలనాకాలానికి సంబంధించి చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, సన్నిహితులపై 13 అవినీతి కేసులు ఉన్నాయని, ఇందులో మద్యం కుంభకోణం కేసు కూడా కీలకమైందన్నారు. ఈ కేసులను నిర్వీర్యం చేసేందుకు సీఎం పదవిని అడ్డం పెట్టుకుంటున్నారని విమర్శించారు. అప్పట్లో మద్యం లిక్కర్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారన్నారు. అలాంటి చంద్రబాబు అధికారంలోకి రాగానే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కీలకంగా పని చేసిన వారిపై కేసులు పెట్టిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఒక్క బెల్ట్ షాపు లేదని, ప్రభుత్వమే పారదర్శకంగా మద్యం షాపులు నిర్వహించిందన్నారు. నేడు ఏ గ్రామంలో చూసినా బెల్ట్‌షాపులు దర్శనమిస్తున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు మద్యం మాఫియాగా మారారని విమర్శించారు. సిట్ కట్టు కథలతో అల్లుతున్న మద్యం అక్రమ కేసు న్యాయస్థానాల్లో నిలబడదని 'అనంత' తేల్చి చెప్పారు.

కక్షతోనే మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి సర్కార్ కక్షతోనే అక్రమ కేసు బనాయించిందంటూ వైఎస్సార్ సీపీ రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల సమన్వయకర్తలు మెట్టు గోవిందరెడ్డి, విశ్వేశ్వర రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని 'మెట్టు' కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో ప్రతిపక్షం లేకుండా చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. మద్యం కుంభకోణం అంటూ నానా యాగీ చేయడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఏ గ్రామంలో చూసినా బెల్టు షాపులు కనిపిస్తున్నాయన్నారు. బిహార్ రాష్ట్రం కంటే అధ్వానంగా ఏపీలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందన్నారు. హామీలు గాలికొదిలి ప్రజాసంక్షేమాన్ని అటకెక్కించారని దుయ్యబట్టారు. హామీలివ్వడం తర్వాత గాలికొదలడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఏ హామీలిచ్చారు.. వాటిలో ఎన్ని నెరవేర్చారనే విషయాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి కార్యకర్త గడప గడపకూ వెళ్లి బాబు మోసాలను ఎండగట్టాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తామన్నందుకే ప్రజలు కూటమికి ఓట్లేశారని, కానీ నేడు వారి ఆశలు అడియాసలయ్యాయన్నారు. అక్రమ అరెస్టులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడేది లేదని, అందరికీ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, పట్టణ, రూరల్, డి హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, రామాంజినేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామాంజినేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు మారెన్న, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, పార్టీ జిల్లా నేత వీరన్న, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి కేపీదొడ్డి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వ, చిత్రంలో మెట్టు

సారు తీరు.. బేజారు!

'ముద్ర' లేని పాలన

- రికార్డుల కోసం తాపత్రయం
- సమీక్షలతో విసిగిపోతున్న అధికారులు
- పర్యటనలు కూడా మంత్రి ఇలాకాకే పరిమితం
- ఊసేలేని పదోన్నతుల కల్పన
- ఉన్నతాధికారి వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు

అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగంలో రెవెన్యూశాఖ పెద్దన్న పాత్ర పోషిస్తుంది. పరిపాలనలో ఉన్నతాధికారులు తమదైన ముద్ర వేస్తుంటారు. తమ పనితీరుతో శాశ్వతంగా గుర్తుండిపోతారు. వారి పాలనా కాలం ఉద్యోగులు, ప్రజల్లో నిరంతరం చర్చలో ఉంటుంది. అయితే ప్రస్తుతం 'ముద్ర' లేని పాలన సాగుతోందనే చర్చ ఉద్యోగవర్గాల్లో సాగుతోంది. క్షేత్రస్థాయి పర్యటనల కంటే వీసీలు, సమావేశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కార్యక్రమాల నిర్వహణలో నాణ్యత కోసం కంటే రికార్డుల కోసం తాపత్రయపడడం.. నిరంతరం సమీక్షలతో అధికారులను విసుగెత్తించడం.. పర్యటనలు కాస్తా మంత్రి ఇలాకాకే పరిమితం చేయడం.. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంపై ఆసక్తి చూపకపోవడం.. ఇలా ఉన్నతాధికారి పాలనాతీరుపై విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.

రికార్డుల వెంట పరుగు...

పాలనలో ముద్ర వేయడం అటుంచి రికార్డుల కోసం తాపత్రయం అధికంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో ఉన్నతాధికారి తీరుతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని పలువురు జిల్లా అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ విషయంలో ఒక్కొక్క శాఖ కనీసంగా రూ.లక్ష వరకు ఖర్చుచేసుకుంది. ఈ మొత్తం ఎలా అనేది 'తరువాతి' మాట. ఇక రెడ్‌క్రాస్ సభ్యత్వం తీసుకోవాలని ఒత్తిడి చేయడంతో అధికారులు, ఉద్యోగులు తప్పదన్నట్లుగా డబ్బు చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ల విషయం, దివ్యాంగుల రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం, అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణలోనూ అధికారులు ఒత్తిడికి గురయ్యారు.



కలెక్టర్ కార్యాలయం

సమీక్షలతో సరి...

ఉన్నతాధికారులు సహజంగా క్షేత్రస్థాయి పర్యటనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం పరిపాటి. సమీక్షలు వారంలో రెండుమూడుసార్లు నిర్వహిస్తూ ఉంటారు. అయితే ప్రస్తుతం క్షేత్రస్థాయి పర్యటనల కంటే సమీక్షలతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. రోజుకు కనీసంగా రెండు మూడు సమీక్షలు.. ఒక్కొక్కసారి ఐదారు వరకు సమీక్షలు ఉంటాయని అధికారవర్గాలు వాపోతున్నాయి. పోనీ ఇందులో ఏమైనా 'సారం' ఉంటుందా... అంటే అదీ లేదని అంటున్నారు. ఒక కార్యక్రమానికి సంబంధించి బాధ్యత అప్పగించి... అందుకు గడువు నిర్దేశించి... అటు తరువాత పురోగతిపై సమీక్షిస్తే ఫలితం ఉంటుంది. కానీ రోజూ సమీక్షించడం ద్వారా కాలం వృథా తప్ప ప్రయోజనం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి ఇలాకాకే పరిమితం

ఉన్నతాధికారి అరకొరగా చేపట్టే క్షేత్రసాయి పర్యటనలూ విమర్శలకు తావిస్తున్నాయి. ప్రభుత్వ పథకాల అమలు కార్యక్రమాలైతేనేమి... ఇతరత్రా అంశాలపై నిర్వహించే పర్యటనల్లో ఎక్కువ భాగం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గానికే పరిమితం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక ఎప్పుడైనా పర్యటనలు చేస్తే జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న మండలాలకే సరిపెడుతున్నారు తప్ప.. సుదూరంగా ఉన్న బొమ్మనహాళ్, కణేకల్లు, డీ హీరేహాళ్, బ్రహ్మసముద్రం, కంబదూరు, కుందుర్పి, విడపనకల్లు తదితర మండలాల్లో పర్యటించిన దాఖలాలు ఒకటీ అర తప్ప పెద్దగా లేవని చెబుతున్నారు.

పదోన్నతుల ఊసేలేదు...

రెవెన్యూశాఖలో పదోన్నతుల కల్పన ఊసేలేకుండా పోయింది. జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి డిప్యూటీ తహసీల్దారు స్థాయి వరకు పదోన్నతుల కోసం ఉద్యోగులు ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. ఈ అంశం చర్చకు వచ్చినప్పుడు హడావుడిగా ఫైలు సిద్ధం చేయాలని చెప్పడం... అటు తరువాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందనే అభిప్రాయం ఉద్యోగవర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇప్పట్లో తమకు పదోన్నతులు రావనే అభిప్రాయానికి ఉద్యోగులు వచ్చారంటే పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక.. అధికారులు తమ చాంబర్ల సుందరీకరణకు, బంగ్లాల్లో సుందరీకరణకు లక్షల రూపాయల ప్రభుత్వ నిధులను ఖర్చు చేస్తున్నారు. అయితే కలెక్టర్ కార్యాలయం ముందు భాగాన ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి మండపం నిర్మించాలనే ఆలోచన చేయకపోవడం కూడా వీరికే చెల్లుతుంది.

తల్లీ పిల్లల అదృశ్యం


పిల్లలతో మాధవి (ఫైల్)

గుత్తి: గుడికని వెళ్లిన తల్లీ పిల్లలు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తిలో గాంధీనగర్ కాలనీకి చెందిన మాధవి తన కుమారుడు, కుమార్తెతో కలిసి రెండు రోజుల క్రితం గుడికి వెళ్తున్నానని ఇంటిలో చెప్పి వెళ్లింది. తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎన్ని చోట్ల గాలించినా ఎక్కడా కనిపించలేదు. మాధవి తండ్రి వెంకటరాముడు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ శనివారం తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

(ప్రభుత్వరంగ సంస్థ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయోజితం)

ప్రాంతీయ కార్యాలయం : అనంతపురము గుంతకల్లు మెయిన్ బ్రాంచ్

స్వాధీనతా ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని **రూల్-8(1)**)

(స్థిరాస్తి కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002, (యాక్ట్ నం.54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, **ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, గుంతకల్ మెయిన్ బ్రాంచ్** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు 15.05.2025 తేదీగల డిమాండ్ నోటీసు జారీచేసి, దిగువ తెలిపిన రుణగ్రహీత/లు, కో-ఆబ్లిగెంట్/ హామీదారులు/ తనఖాదారులను సదరు నోటీసులో తెలిపిన మొత్తం **రూ.9,12,750/-** (తొమ్మిది లక్షల పన్నెండు వేల ఏడు వందల యాభై రూపాయలు మాత్రమే)తో పాటు 15.05.2025 నుండి వడ్డీ మరియు వ్యయాలు మొదలగు వాటిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాల్సిందిగా కోరారు.

రుణగ్రహీత	గ్యారంటారు / కో-ఆబ్లిగెంట్	తనఖాదారు/లు
శ్రీ సాకే ఓబులేసు తండ్రి శ్రీ సాకే ఓబులేసు, డి.నెం. 21-49, పెద్దబావి వీధి, గుంతకల్లు - 515 801	శ్రీ చిగిలి వెంకటేశ్వర్లు, తండ్రి శ్రీ చిగిలి నరసింహప్ప, డి.నెం.18-85, పెద్దబావి వీధి దగ్గర, ఓల్డ్ గుంతకల్లు, గుంతకల్లు - 515 801.	శ్రీ సాకే ఓబులేసు తండ్రి శ్రీ సాకే ఓబులేసు, డి.నెం. 21-49, పెద్దబావి వీధి, గుంతకల్లు - 515 801

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **15 జూలై 2025**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారము జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఎలాంటి వ్యవహారములైనా **రూ.9,12,750/-** (తొమ్మిది లక్షల పన్నెండు వేల ఏడు వందల యాభై రూపాయలు మాత్రమే)తో పాటు 15.05.2025 నుండి దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలు మొదలైనవి **ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్** చార్జికి లోబడి ఉంటాయి. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు రుణగ్రహీతకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్‌సెక్షన్ (8)లోని ప్రొవిజన్లను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

ఆస్తి షెడ్యూల్

దిగువ తెలిపినవి కలిగిన ఆస్తియావత్తు.

ఆస్తి వివరాలు	నివాస ఇల్లు
ప్రదేశం	అనంతపురము RD, గుంతకల్లు SRD తో ఓల్డ్ గుంతకల్లు మున్సిపల్ రెసిడెన్షియల్ ఏరియాలో గుంతకల్లు విలేజ్ ఫీల్డ్స్, పాత సర్వే నెం.479, కొత్త సర్వే నెం. 479-బి1లోగల డి.నెం.54, కొత్త వార్డు నెం.16, ప్రస్తుత వార్డు నెం. 21, డి.నెం.49 కలిగిన ఇంటి ఆస్తి. విస్తీర్ణం 135.66 చ.గజాలు.
సర్వే నెం.	479, కొత్త సర్వే నెం. 479-బి1
విస్తీర్ణం	135.66 చ.గజాలు లేదా 113.95 చ.మీటర్లు.
యజమాని పేరు	శ్రీ సాకే ఓబులేసు
సరిహద్దులు	తూర్పు : గౌరువ తిప్పయ్య ఇల్లు; పశ్చిమం : అరుసల సోమిరెడ్డి ఇల్లు; ఉత్తరం : రోడ్డు; దక్షిణం : రోడ్డు.

తేది : 15-07-2025
ప్రదేశం : అనంతపురము

(పి. శ్రీదేవి) సం/- అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తరపున

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

(ప్రభుత్వరంగ సంస్థ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయోజితం)

ప్రాంతీయ కార్యాలయం : అనంతపురము తాడిపత్రి శాఖ

అనుబంధం - I

ఇ-వేలం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదవబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిర ఆస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

దిగువ వారికి

రుణగ్రహీత(లు)	గ్యారంటార్లు / కో-ఆబ్లిగెంట్స్	తనఖాదారు/లు
1) శ్రీ పెల్లకూరి రాజారమేష్ తండ్రి శ్రీ పెల్లకూరి భాస్కర్, డి.నెం. 3/799-15-2, వార్డు నెం. 3, కృష్ణాపురం 9వ రోడ్, తాడిపత్రి-515411. 2) శ్రీమతి పెరుమాళ్ళ సుధారాణి, భర్త శ్రీ పెల్లకూరి రాజారమేష్, డి.నెం.3/799-15-2, వార్డు నెం. 3, కృష్ణాపురం 9వ రోడ్, తాడిపత్రి-515411.	3) శ్రీ దార శిలాను తండ్రి శ్రీ దార ఇెర్మనీ, డి.నెం.3/799-15-3, వార్డు నెం. 3, కృష్ణాపురం 9వ రోడ్డు, తాడిపత్రి-515411.	4) శ్రీ పెల్లకూరి రాజారమేష్ తండ్రి శ్రీ పెల్లకూరి భాస్కర్, డి.నెం. 3/799-15-2, వార్డు నెం. 3, కృష్ణాపురం 9వ రోడ్, తాడిపత్రి-515411.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కి తనఖాపెట్టిన, సెక్యూర్డ్ క్రెడిటార్, తాడిపత్రి శాఖ యొక్క అధీకృత అధికారిచే భౌతిక/ లాంఛనప్రాయ స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి పైన తెలిపిన రుణగ్రహీతలు మరియు గ్యారంటార్ల నుండి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, తాడిపత్రి శాఖ వారికి బకాయిపడిన మొత్తం రూ. **50,07,714/-** (యాభై లక్షల ఏడు వేల ఏడు వందల పద్నాలుగు రూపాయలు మాత్రమే) **(29-11-2024 నాటికి)** (స్వాధీనం చేసుకున్న తర్వాత ఎటువంటి చెల్లింపు లేనిచో, స్వాధీనత ప్రకటనలో తెలిపిన విధంగా బకాయి మొత్తంను, చెల్లింపుచేస్తే, ఆ తేదీ నాటికి ప్రస్తుత మిగులు బకాయిను తెలపండి) తోపాటు కాంట్రాక్చెడ్ రేటు వంతున భవిష్యత్ వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టు కొనుటకు **25-08-2025 (వేలం తేది)** న "ఎక్కడ ఎలా ఉన్నది అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు "అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికపై విక్రయించుబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు(లు)కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. **బయానా దాఖలు కొరకు చివరి తేదీ 24-08-2025న లేదా అలోగా సా॥ 5-00 గం॥ల వరకు. రిజర్వుధర మరియు బయానా** దిగువ తెలిపిన విధంగా ఉంటాయి.

ఇ-వేలం తేది మరియు సమయం : 25-08-2025న ఉ॥ 11-00 గం॥లకు

రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని 24-08-2025 న లేదా అలోగా సా॥ 5-00 గం॥ల వరకు I.ఐటమ్ నం.1 : కొరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, తాడిపత్రి శాఖ, అకౌంట్ నం. **93341010770, IFSC** కోడ్ : **APGB0001077** ఖాతాలో జమఅయ్యేలా **RTGS/NEFT/** ఫండ్ ట్రాన్స్‌ఫర్ రూపంలో డిపాజిట్ చేయాలి.

ఆస్తి వివరణ :

ఐటమ్ నం. 1

ఆస్తి వివరాలు :	
లొకేషన్:	అనంతపురం RD, తాడిపత్రి SRDలోగల మరియు తాడిపత్రి మున్సిపాలిటీలోని 3వ వార్డ్‌లో ఏర్పడిన భాగం మరియు పుట్లూరు రోడ్డు తూర్పు దిక్కున ఉన్న క్రిష్ణాపురం వీధిలో 9వ మరియు 10వ రోడ్డు మధ్య నివాస ఇంటి ఆస్తి. ప్లాట్ నం. 64 తూర్పు అర్ధ భాగంలో - ఎ. 0-01.01 సెంట్లు (తూర్పు-పడమర: 10 అడుగులు, ఉత్తరం-దక్షిణం : 44 అడుగులు) ప్లాట్ నం. 65 పడమర భాగంలో - ఎ. 0-01.01 సెంట్లు (తూర్పు-పడమర: 10 అడుగులు, ఉత్తరం-దక్షిణం : 44 ¼ అడుగులు)
సర్వే నం :	694
విస్తీర్ణం :	98.05 చదరపు గజాలు
యజమాని పేరు:	శ్రీ పెల్లకూరి రాజారమేష్
సరిహద్దులు :	తూర్పు : అదే సర్వే నెంబరులో అనగా ప్లాట్ నెం.65లో తూర్పు వైపు అర్ధ భాగం మరియు ప్లాట్ నెం.66లో పడమర వైపు అర్ధ భాగం, ప్రస్తుతమున్న బేస్‌మెంట్‌తో పాటు దార శిలానుకు బొమ్మన నరేష్‌కుమార్ రెడ్డి ద్వారా విక్రయించబడిన స్థలం. పడమర: పామిరెడ్డి శ్రీధర్‌రెడ్డి నుండి నిచ్చెనమెట్ల నాగమణి ద్వారా కొనుగోలుచేయబడిన స్థలం, దక్షిణం : 20 అడుగుల వెడల్పు రోడ్, ఉత్తరం : 20 అడుగుల వెడల్పు రోడ్.

క్ర. సం.	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	వాస్తవ విస్తీర్ణం	హెచ్చార్లు
1.	694	ఎ.05-27	0-09.55 పైకి 0-02.02	0-008

ప్లాట్ నం.64లో తూర్పు వైపు అర్ధభాగం మరియు ప్లాట్ నం.65లో పడమర వైపు అర్ధభాగం

రిజర్వు ధర : రూ. **70,00,000/-** బయానా : రూ. **7,00,000/-** బిడ్ పెంపుదల : రూ. **10,000/-**

బిడ్డర్లు తమ బిడ్లు దాఖలుచేయుటకు ముందు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనేముందు వేలం అమ్మకం యొక్క సవివర నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ : https://bankauctions.in (బ్యాంక్ వెబ్‌సైట్ : https://apgb.bank/auctions) ను దర్శించాల్సిందిగా సూచించబడుచున్నారు. అధీకృత అధికారి ఉత్తమ సమాచారం మరియు పరిజ్ఞానం మేరకు, ఆస్తిపై ఎటువంటి తాకట్టు రుణ భారములు లేవు. ఆసక్తిగల బిడ్డరు వేలం వివరాలకను పొందుటకు అధీకృత అధికారిని సంప్రదించవచ్చు మరియు ఆస్తిని 01-08-2025న (ఆస్తిని సందర్శించే తేది తెలపండి) తనిఖీచేయవచ్చు. సంప్రదించు నం. 9490158268, మెయిల్ ఐడి : br1077@apgb.in (శాఖ మెయిల్ ఐడి తెలపండి).

ప్రదేశం : తాడిపత్రి
తేది : 20-07-2025

సం/- అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

భగీరథ ప్రయత్నం

కాసులు కురిపించే కరివేపాకు పంటకు గడ్డుకాలం వచ్చింది. వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లలో నీరు తగ్గిపోయాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు నీటి కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి బోర్లపై బోర్లు వేయిస్తున్నా నీటి చెమ్మ కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

- కరివేపాకుకు నీటి తడులు కరువు
- వర్షాభావంతో అడుగంటిన భూగర్భజలాలు
- 800 అడుగులు బోరు వేసినా కనపడని నీటి చుక్క


యర్రగుంటపల్లి వద్ద సాగు చేసిన కరివేపాకు తోట

తాడిపత్రి రూరల్: కరివేపాకు పంటకు తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాలు ప్రసిద్ధిగాంచాయి. ఇక్కడ రైతులు విస్తారంగా కరివేపాకు సాగు చేసి సీజన్‌లో మంచి ఆదాయం పొందుతూ వస్తున్నారు. అయితే ఈసారి వారి ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. తాడిపత్రి మండలంలో 350 ఎకరాలు, పెద్దపప్పూరు మండలంలో 780, యాడికి మండలంలో 100, యల్లనూరు, పుట్లూరు మండలాల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో కరివేపాకు సాగులో ఉంది. సాధారణంగా నవంబర్ నుంచి మార్చి వరకు కరివేపాకు సీజన్ ఉంటుంది.

వెంటాడుతున్న వర్షాభావం

నీటి తడులపై ఆధారపడే కరివేపాకు పంటను అడుగంటుతున్న భూగర్భ జలాలు వెక్కిరిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర కావస్తున్నా తాడిపత్రి ప్రాంతంలో మోస్తరు వర్షం కూడా కురవలేదు. సకాలంలో వర్షాలు కురిసి ఉంటే పంటను రక్షించుకునేందుకు వీలుండటంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు ఉండేవి. రెండూ లేకపోవడంతో పంటను ఎలా రక్షించుకోవాలో తెలియక రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు కురిసినా కురవకపోయినా తాడిపత్రి బ్రాంచి కెనాల్‌కు వచ్చే హెచ్చెల్సీ నీరు అండగా ఉండేది. ప్రస్తుతం ఆ నీరు కూడా సకాలంలో ఆశించినస్థాయిలో రావడంలేదు. మూడు నెలల పాటు కాపాడుకోగలిగితే సీజన్‌లో మంచి ధరకు అమ్ముకోవచ్చు. అంతవరకూ ఎలాగైనా పంటకు నీటి తడులు ఇవ్వాలని రైతులు కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. 800 అడుగుల లోతువరకు వేయించినా నీటి చుక్క కనిపించడం లేదు.

పెరుగుతున్న పెట్టుబడులు..

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరివేపాకు పంటకు పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. సాధారణంగా ఎకరా పంట సాగుకు ప్రారంభంలో రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. రెండో పంటకు రూ.60వేల చొప్పున ఖర్చు చేయాలి. వాతావరణ పరిస్థితుల కారణంగా తెగుళ్లు వ్యాపిస్తే మందులు కొట్టాలి. ప్రస్తుతం రూ.లక్షలు వెచ్చించి అదనంగా బోర్లు వేయిస్తుండటంతో పెట్టుబడులు పైపైకి వెళ్లిపోతున్నాయి.


ఎండిపోయిన బోరు నుంచి పైపులు బయటకు తీస్తున్న దృశ్యం


కొత్తగా బోరు వేస్తున్న దృశ్యం

4 బోర్లు వేయించినా...



వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లల్లో భూగర్భజలాలు అడుగంటాయి. ఎనిమిది ఎకరాల్లోని కరివేపాకు పంటను కాపాడుకునేందుకు ఒకదాని తర్వాత మరొకటి అలా నాలుగు బోర్లు 800 అడుగుల లోతు వరకు వేయించాను. ఒక్కదానిలో మాత్రమే అరకొర నీరు పడింది. ఈ నీరు పంటను కాపాడుకోవడానికి ఏమాత్రమే సరిపోవడం లేదు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

– శ్రీరాములు, యర్రగుంటపల్లి

నీరు లేక పంట తొలగించుకున్నా



కరివేపాకు పంట కలిసివస్తుందని ఎనిమిది ఎకరాల్లో వేశాను. భూగర్భజలాలు అడుగంటాయి. కొత్త బోర్లు వేసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఏడు ఎకరాల్లో పంటను తొలగించి.. ఎకరం మాత్రమే ఉంచుకున్నాను. ఈ ఎకరాకు బోరు నుంచి నీరు సక్రమంగా అందడం లేదు. రోడ్డు విస్తరణ పేరుతో వంకలో వేసిన బోరుతోపాటు పైపులైన్లు దెబ్బతిన్నాయి.

– నారాయణస్వామి, రైతు, యర్రగుంటపల్లి

ఏడీఏగా అల్తాఫ్ అలీఖాన్

- 40 రోజుల తర్వాత వెల్లడైన బదిలీ జాబితా
- ఉత్తర్వులు వచ్చిన గంటల వ్యవధిలోనే జాయినింగ్


జేడీఏ ఉమామహేశ్వరమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: అత్యంత కీలకమైన వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా జీఎం అల్తాఫ్ అలీఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కమిషనరేట్ నుంచి బదిలీ ఉత్తర్వులు వెల్లడయ్యాయి. ఈ స్థానం కోసం పోటీలో ఉన్న జి.క్రిష్ణయ్యను హిందూపురం ఏడీఏగా బదిలీ చేశారు. అల్తాఫ్ అలీఖాన్ ప్రస్తుతం హిందూపురం ఏడీఏగా ఉన్నారు. ఇప్పటి వరకు అనంతపురం ఏడీఏగా ఉన్న జి.రవిని తాడిపత్రికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ సమయంలో ధర్మవరంలో పనిచేస్తున్న క్రిష్ణయ్య తాడిపత్రి కావాలని దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురం స్థానం కోసం ఆయన కోరుకోకున్నా... బది'లీల'ల్లో భాగంగా పోటీలోకి తెచ్చారు. కాగా సాధారణ బదిలీల్లో భాగంగా గత నెల 9న విడుదల చేసిన మొదటి జాబితాలోనే ఈ ఇరువురు అధికారులకు ఇవే స్థానాలు కేటాయించారు. అయితే అదే రోజు ఉన్నఫళంగా వెనక్కు తీసుకున్నారు. అప్పటి నుంచి నాటకీయ పరిణామాలు, పైరవీలు, సిఫారసులు, రాజకీయ జోక్యం అధికం కావడంతో దాదాపు 40 రోజుల పాటు ఎటూ తేల్చకుండా ఉంచారు. అనంతపురం ఏడీఏ స్థానం అంశం సీఎం, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడుతో పాటు ఉన్నతస్థాయి అధికారుల వరకు మరోసారి వెళ్లినట్లు చెబుతున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, కొందరు డీలర్లు అల్తాఫ్ కావాలని, కమిషనరేట్ అధికారులు, అసోసియేషన్ నాయకులు క్రిష్ణయ్య కావాలంటూ పట్టుపట్టినట్లుగా చెబుతున్నారు. ఇలా వ్యవసాయశాఖ పరిధిలో అనంతపురం ఏడీఏ స్థానం కీలకం కావడంతో క్రిష్ణయ్య అంటూ ఉదయం, అల్తాఫ్ అంటూ సాయంత్రం ఇలా రోజూ ఇరువురు అధికారుల పేర్లు చక్కర్లు కొడుతూ వచ్చాయి. ఎట్టకేలకు అల్తాఫ్ అలీఖాన్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించి ఉత్కంఠకు తెరదించారు. ఉత్తర్వులు వెలువడిన గంటల వ్యవధిలోనే అల్తాఫ్ అలీఖాన్ సత్యసాయి జిల్లాలో రిలీవ్ అయ్యి అనంతపురం జేడీఏ ఉమామహేశ్వరమ్మను కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు.

నేటి నుంచి మస్తానయ్య ఉరుసు


మస్తానయ్య దర్గా

గుంతకల్లు: పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి స్వామి 390వ ఉరుసు ఉత్సవాలు ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమవుతాయని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీం తెలిపారు. కులమతాలకు అతీతంగా మూడు రోజులు పాటు జరిగే ఈ ఉరుసు ఉత్సవాలకు దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారని పేర్కొన్నారు. భక్తుల కోసం తాగునీరు, తాత్కాలిక టాయిలెట్లు, దర్గా ఖాళీ ప్రదేశాల్లో షామియానాలు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మున్సిపల్ అధికారుల సహాయంతో నీటి ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉంచామన్నారు. తొలిరోజు ఆదివారం గంధం మహోత్సవం, సోమవారం షంషీర్ (ఉరుసు ఉత్సవం), మంగళవారం జియారత్‌తో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయన్నారు. దర్గా ఉత్తర, దక్షిణ ఆర్చ్‌లతో పాటు దర్గా ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో అందంగా అలకరించామని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీల్లో కార్తికేయ సత్తా

విశాఖ స్పోర్ట్స్: విశాఖ సాగర తీరంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రూప్-1, 2, 3 కేటగిరీల్లో బాలబాలికలకు బటర్‌ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీస్టయిల్ అంశాల్లో పోటీలు జరిగాయి. అనంతపురానికి చెందిన స్విమ్మర్ కార్తికేయ సత్తా చాటాడు. గ్రూప్-1లో బాలుర 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 200 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగాల్లో అనంతపురానికి చెందిన ఎస్.కార్తికేయ విజేతగా నిలిచాడు.

సీమకు తీరని అన్యాయం

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతి ధ్వజం



మాట్లాడుతున్న గాజుల ఉమాపతి

అనంతపురం కార్పొరేషన్: రాయలసీమకు చంద్రబాబు తీరని అన్యాయం చేశారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి ధ్వజమెత్తారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలులో లా యూనివర్సిటీ, హెచ్ఆర్‌సీ, హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే.. కూటమి ప్రభుత్వం వాటిని అమరావతికి తరలించి రాయలసీమకు తీరని అన్యాయం చేశారన్నారు. లోకాయుక్తను తరలించేందుకు సీఎం చంద్రబాబు కుట్ర చేస్తున్నారన్నారు. హంద్రీ-నీవాను ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది చంద్రబాబేనన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కారణంగానే హంద్రీ-నీవా నీరు వస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని నాగన్న, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, న్యాయవాదులు రాజశేఖర్ యాదవ్, బాల్జీ మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో భాగంగా అనంతపురం జిల్లాకు ఎయిమ్స్ మంజూరైతే.. దాన్ని అమరావతికి తరలించిన దుర్మార్గుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ఎయిమ్స్ ఏర్పాటై ఉంటే జిల్లాలో వైద్య సేవల్లో నాణ్యత పెరగడమే కాకుండా వందలాది మందికి ఉపాధి లభించేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాదులు మురళీధర్, రమణారెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు


నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డి, ఎల్ఎం మోహన్‌రెడ్డి, కె.రమేష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు నాయకులకు చోటు దక్కింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం పార్లమెంట్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా కె.రమేష్‌రెడ్డి, నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, హిందూపురం పార్లమెంట్ పరిధిలో రాష్ట్ర కార్యదర్శులుగా ఎల్ఎం మోహన్‌రెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి, బోయ తిప్పేస్వామి నియమితులయ్యారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను వీరికి కేటాయించనున్నారని, వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజినల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాత వాహనాల వేలానికి ఏర్పాట్లు

సాక్షి ఎఫెక్ట్..


వేలం వేసేందుకు వాహనాలను వరుసగా ఉంచిన దృశ్యం

అనంతపురం అర్బన్: కలెక్టరేట్ ఆవరణలో ఉంచిన పాత వాహనాలను వేలం వేసేందుకు మోక్షం కలిగింది. ఈ నెల 7న 'ఇతరులకు చెబుతాం... ఆచరించం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. పాత వాహనాలు వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టరేట్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టి వాహనాలను ఒక క్రమంలో ఏర్పాటు చేయించారు. వాటి విలువ నిర్ధారించేందుకు ఆర్టీఏ అధికారులకు లేఖ రాశామని చెప్పారు. ఇదిలా ఉండగా వాహనాల స్థితిని పరిశీలిస్తే అవి గుజిరీకి తప్ప మరెందుకూ పనికిరావని పలువురు ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ముగిసిన జ్యోతుల ఉత్సవాలు



అన్నదానం చేస్తున్న రాగే పరుశురామ్

అనంతపురం కల్చరల్: ఉమానగర్‌లో వెలసిన రేణుకా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సాగిన జ్యోతుల ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా యల్లమ్మకు విశేష పూజలు, అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది. మాజీ మేయర్ రాగే పరుశురామ్, కార్పొరేటర్ బండి నాగమణి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఆషాఢ మాసం ముగిసే సందర్భంలో లోక కల్యాణం కోసం భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాన్ని వితరణ చేయడం సంప్రదాయంగా వస్తోందన్నారు. యల్లమ్మ దయతో విస్తారంగా వర్షాలు కురిసి రైతన్నలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అంతకు ముందు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నాగరాజు, ప్రసన్న, గోశల లక్ష్మన్న,నవీన్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై పిల్లలకు అవగాహన కల్పించాలి



పిల్లలకు పరిసరాల పరిశుభ్రత గురించి తెలియజేస్తున్న ఐసీడీఎస్ పీడీ నాగవేణి

ఆత్మకూరు: ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే అనర్థాలపై చిన్నారులకు అవగాహన కల్పించాలని, తద్వారా భవిష్యత్‌లో ప్లాస్టిక్ రహిత సమాజానికి మార్గం సుగమం అవుతుందని ఐసీడీఎస్ పీడీ నాగవేణి తెలిపారు. శనివారం ఆమె సీడీపీఓ ఉమా శంకరమ్మతో కలసి మండలంలోని పంపనూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన 'స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నతనం నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారం ప్రతి ఒక్కరికి అందించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చెట్లు పెంచాలని, తాజా కూరగాయలతో పిల్లలకు ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: సమాచార చట్టంపై ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బందికి శనివారం అవగాహన కల్పించారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ ధనుంజయ, ఉద్యానశాఖ డీడీ డి.ఉమాదేవి, ఏడీ దేవానంద్, సూపరింటెండెంట్ బాషా, హెచ్‌ఓ రత్నకుమార్ తదితరులు చట్టం గురించి తెలియజేశారు. ప్రభుత్వ పథకాలు, విధులు, నిధుల గురించి పౌరులు అడిగే సమాచారం సకాలంలో అందించే క్రమంలో తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. అందుకోసం రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్‌లో ఎప్పటికపుడు వివరాలు నమోదు చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. సాధ్యమైనంత మేరకు చట్టాన్ని ఆశ్రయించకుండా వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచడం వల్ల కూడా మేలు జరుగుతుందని తెలిపారు. చట్టం గురించి సమగ్రంగా తెలుసుకుని పారదర్శకత, జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

లక్ష్యం ఉంటేనే ఉజ్వల భవిష్యత్



పాటలు పడుతున్న చిన్నారులు

రాప్తాడు: విద్యార్థులు ఓ లక్ష్యం నిర్ణయించుకుని అందుకోసం కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎల్లార్జీ ప్రిన్సిపల్ బొంతు ప్రసాద్ అన్నారు. శనివారం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 'ఫ్రెషర్స్ డే' వేడుకలను నిర్వహించారు. తొలుత పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ... ఎంత పెద్ద లక్ష్యమైనా... తొలి అడుగుతోనే ప్రారంభమవుతుందన్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదీ కష్టం కాదన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలు, నృత్యాలు, పాటలు, స్కిట్‌లు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొంక శేఖర్, సిస్టర్ లియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం చేస్తుంటే ఏం చేస్తున్నారు?

- నగరపాలక సంస్థ అధికారులను ప్రశ్నించిన మేయర్ వసీం
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో రూ.9.29 కోట్ల పనులకు ఆమోదం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: 'ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ నిర్వాహకులు నగరంలో ఎక్కడ పడితే అక్కడ రోడ్లను ఛిద్రం చేస్తున్నారు. పునరుద్ధరణ పనులు సరిగా జరగడం లేదు. కోర్టు రోడ్డులో నాసిరకంగా పనులు చేస్తున్నా పట్టించుకోరా.. రూ.లక్షల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన రోడ్లు పాడవుతున్నాయి. తక్షణం ఆ పనులను పరిశీలించండి' అని మేయర్ వసీం అన్నారు. శనివారం నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మేయర్ మాట్లాడుతూ ఇంజినీర్లు అభివృద్ధి పనులతో పాటు నగరంలో జరుగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.9.29 కోట్ల పనులకు ఆమోదం..

స్టాండింగ్ కమిటీ సమావేశంలో రూ.9.29 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. 38వ డివిజన్ కోవూర్‌నగర్‌లో రూ.47 లక్షలతో 1000 ఎంఎం సీసీ రోడ్డు, 3వ డివిజన్ వేణుగోపాల్‌నగర్‌లో రూ.10.60 లక్షలతో సీసీ రోడ్డు, 30వ డివిజన్ జీసస్‌నగర్‌లో రూ.39 లక్షలతో సీసీ రోడ్డు, 3వ డివిజన్‌లో రూ.రూ.12.25 లక్షల సీసీ రోడ్డు, అదే డివిజన్‌లో రూ.10.50 లక్షలతో సీసీ డ్రైన్, 37వ డివిజన్ రామ్‌నగర్‌లో రూ.42.35 లక్షల వ్యయంతో 600 ఎంఎం సీసీ రోడ్డు, రామ్‌నగర్‌లోని మంత్రి పయ్యావుల కేశవ్ ఇంటి ముందు నుంచి త్రివేణి అపార్ట్‌మెంట్ వరకు రూ.19.50 లక్షలతో సీసీ రోడ్డు, 14వ డివిజన్ కమలానగర్‌లో రూ.37.50 లక్షలతో సీసీ డ్రైన్, 35వ డివిజన్ ఆదర్శకాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు, అదే డివిజన్‌లో రూ.38 లక్షలతో సీసీ రోడ్డు, రూ.34.60 లక్షలతో మరో సీసీ రోడ్డు, 32వ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.11.50 లక్షలతో సీసీ రోడ్డు, అదే డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు, ఆదర్శనగర్‌లో రూ.11.50 లక్షలతో సీసీ రోడ్డు, రూ.24 లక్షలతో సీసీ రోడ్డు, 48,49 డివిజన్లకు సంబంధించి శాంతినగర్ సర్కిల్ నుంచి గౌరవ గార్డెన్ వరకు రూ.20 లక్షలతో బీటీ రోడ్డు, 36వ డివిజన్ ఆంధ్రాబ్యాంక్ కాలనీలో రూ.14.90 లక్షలతో సీసీ రోడ్డు, 23వ డివిజన్‌లో రూ.18.50 లక్షలతో సీసీ రోడ్డు, 23వ డివిజన్ విజయనగర్ కాలనీలో రూ.18.50 లక్షలతో సీసీ రోడ్డు, 38వ డివిజన్ రామ్‌నగర్‌లో రూ.21.40 లక్షలతో సీసీ డ్రైన్, రామ్‌నగర్‌లోని సిరి అపార్ట్‌మెంట్ వద్ద రూ.21 లక్షలతో సీసీ రోడ్డు, 23వ డివిజన్ శారదనగర్‌లో రూ.26.50 లక్షలతో బీటీ రోడ్డు, నగరంలోని 5వ డివిజన్ ఖాజానగర్ పీవీకేకే కళాశాలకు ఎదురుగా రూ.15 లక్షలతో రక్షణ గోడ, 49 డివిజన్ శ్మశానవాటికకు రూ.40 లక్షలతో ప్రహరీ గోడ, 17వ డివిజన్ కోర్టు రోడ్డులో రూ.32 లక్షలతో సీసీ డ్రైన్, ఫుట్‌పాత్, 20వ డివిజన్ బోయ వీధిలో రూ.26.50 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు, 5వ డివిజన్ ఖాజా నగర్‌లో రూ.38 లక్షలతో సీసీ రోడ్డు, నగరపాలక సంస్థ పరిధిలోని దోబీఘాట్ ఎస్ఎస్ ట్యాంకు వద్ద కమ్యూనిటీ హాల్‌కు రూ.13.20 లక్షలతో మరమ్మతులు, 24వ డివిజన్ నవోదయ కాలనీలో రూ.14.40 లక్షలతో, తదితర అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

సబ్ స్టేషన్లకు స్థలం కేటాయింపు..

నగరం రోజు రోజుకు విస్తరించడంతో పాటు జనాభా అధికమవుతోందని, ఇటువంటి తరుణంలో సబ్‌స్టేషన్లు అవసరమని గతంలోనే పాలకవర్గం ప్రతిపాదించింది. అందుకు సంబంధించి లక్ష్మీనగర్‌లో 6.5 సెంట్లు, కొండారెడ్డి కాలనీలో 19 సెంట్లు, సెంట్రల్ పార్క్‌లో 10 సెంట్ల కేటాయించేందుకు వచ్చిన ప్రతిపాదనను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు మల్లెమీద నరసింహులు, రహంతుల్లా, వినూత, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, కార్యదర్శి రంగస్వామి, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈలు షాకీర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటోంది నువ్వా..నేనా?

- ఎమ్మెల్యే దగ్గుపాటిపై మేయర్ వసీం ధ్వజం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధిని అడ్డుకుంటోంది నువ్వా.. నేనా దగ్గుపాటి ప్రసాద్ అని ఎమ్మెల్యేకి మేయర్ వసీం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ వసీం మాట్లాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్‌కు ఎటువంటి అవగాహన లేదన్నారు. సందు దొరికితే చాలు పాలకవర్గంపై బురదజల్లే ప్రయత్నం తప్ప, నగరంలో అభివృద్ధి చేద్దామన్న ఆలోచన లేదన్నారు. 'మా పార్టీ జెండాపై గెలిచి, నీ వద్దకు వచ్చిన కార్పొరేటర్లను అడుగు వారి డివిజన్లలో అభివృద్ధి జరిగిందో లేదో' అని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రాధాన్యత క్రమంలో రూ.కోట్లలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాను అభివృద్ధిని అడ్డుకునే పరిస్థితే ఉంటే నగరంలో రూ.కోట్ల పనులు ఏవిధంగా జరిగేవని ప్రశ్నించారు. ఈ ఏడాది మార్చిలో రూ.135 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల సౌకర్యార్థం నగరంలో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు 35.5 సెంట్ల స్థలాన్ని కేటాయించామన్నారు.

చేతనైతే నిధులు తీసుకురా!

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నియోజకవర్గంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారని, నగరపాలక సంస్థకు ప్రత్యేక నిధులను మంజూరు చేయించారని మేయర్ గుర్తు చేశారు. చేతనైతే సీఎం చంద్రబాబు నుంచి నగరపాలక సంస్థకు నిధులు కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటికి సవాల్ విసిరారు. 'కౌన్సిల్, స్టాండింగ్ కమిటీల్లో ఆమోదించిన అభివృద్ధి పనులకు భూమి పూజలు చేస్తున్నావ్ దగ్గుపాటీ' అని అన్నారు. ఇప్పటికైనా ముందు చూపుతూ, అవగాహనతో మాట్లాడడం నేర్చుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 13 నెలలవుతున్నా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఇంత వరకు చిల్లి గవ్వ తీసుకురాలేదన్నారు. చౌకబారు విమర్శలు మాని, నగరాభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యేకి సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్ భూషణ్, రహంతుల్లా, శ్రీనివాసులు, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



కనగానపల్లిలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల, గ్రామ కమిటీ సభ్యులు

కనగానపల్లి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కలసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కనగానపల్లిలో పార్టీ మండల కన్వీనర్ నాగముని అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల, గ్రామ కమిటీ, అనుబంధ విభాగాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల నియమకంపై చర్చించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరందరిని ఎంపిక చేస్తున్నామన్నారు. వీరంతా కలసికట్టుగా పనిచేస్తూ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేసుకుందామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షుడు అమరనాథరెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, పార్టీ నాయకులు ముక్తాపురం రమణారెడ్డి, మాజీ డైరెక్టర్ ప్రభాకర్, చిన్నపెద్దిరెడ్డి, అంకె గోపాల్, చింతమేకల రవి, ఆలమూరప్ప, లక్ష్మీనారాయణ, వెంకటరామిరెడ్డి, అంకె గోపాల్, విశ్వనాథ్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, రామాంజి, కృష్ణారెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి చర్యలు




మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో అన్నదాతల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. శనివారం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు అధ్యక్షతన రెడ్డిపల్లి కేవీకే, రేకులకుంట శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు లాభదాయక వ్యవసాయ సలహాలు సూచనలివ్వాలన్నారు. జూలై నెలలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ప్రస్తుతం పంటలలో రైతాంగం చేపట్టాల్సిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఎరువులు యాజమాన్యం, గురించి వివరించారు. అనంతరం పలురువు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆత్మా పీడీ పద్మలత, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, రెడ్డిపల్లి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, కీటక విభాగం శాస్త్రవేత్త జాహ్నవి, డాక్టర్ లక్ష్మిణ్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడులో ఘనంగా పెద్ద సరిగెత్తు

- నేడు జలధికి వెళ్లనున్న పీర్లు



రాప్తాడులో కొలువుదీరిన పీర్ల దేవుళ్లు

రాప్తాడు: మొహర్రం ఉత్సవాలు రాప్తాడులో ఘనంగా జరుగుతున్నాయి. శనివారం పెద్ద సరిగెత్తును భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూలమాలలతో పీర్లను అలంకరించి ప్రార్థనలు చేశారు. భక్తులు భారీగా విచ్చేయడంతో పీర్లు కొలువుదీరిన చావిడి ప్రాంతం కిటకిటలాడింది. భక్తులు పీర్లను దర్శించుకుని చక్కెర చదివింపులు చేయించారు. మరికొందరు పానకాల దుత్తలు సమర్పించారు. మొక్కు ఉన్న భక్తులు ఎద్దులబండ్లు, ట్రాక్టర్ల సాయంతో పెద్దపెద్ద చెట్లు తీసుకువచ్చి పీర్ల గుండంలోకి వేశారు. రాత్రి 8 గంటలకు గుండానికి నిప్పుపెట్టారు. రాత్రి 10 గంటల నుంచి పీర్లను ఊరేగించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు అగ్ని గుండ ప్రవేశం, సాయంత్రం జలధి కార్యక్రమం ఉంటుందని ముల్లాసాహెబ్ పీరా తెలిపారు. అదే విధంగా మండలంలో పాలచెర్ల, గొల్లపల్లి, హంపాపురం గ్రామాల్లో కూడా పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి.

నేడు గాయత్రి అమ్మవారికి సారె

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణ ఐక్య వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం వరకు నగరంలోని హౌసింగ్ బోర్డు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని శ్రీవేదమాత గాయత్రి దేవస్థానంలో ఆషాఢ మాస సారె సమర్పణ ఉంటుందని నిర్వాహకులు ఏఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. అలాగే అమ్మవారికి శాకంబరి అలంకారం, ఒడిబియ్యం, అన్నప్రసాద వితరణ ఉంటాయని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూలో అ'పూర్వ' సమ్మేళనం



అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ముందు పూర్వ విద్యార్థులు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆట్టహాసంగా నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమానికి వీసీ సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో అత్యున్నతమైన స్థాయికి చేరుకున్నారని ప్రశంసించారు. జేఎన్‌టీయూ కీర్తిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తున్న పూర్వ విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు సలహాలు, సూచనలు ఎప్పటికీ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ. దేవన్న, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. వసుంధర, 1980 బ్యాచ్ ఈఈఈ విభాగం పూర్వ విద్యార్థి వైవీవీ ప్రసాద్, 1984 బ్యాచ్ ఈఈఈ విభాగం పూర్వ విద్యార్థి గౌతం సింగ్ నేగి నావల్, 1971 బ్యాచ్ ఈఈఈ విభాగం పూర్వ విద్యార్థి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



● దంచికొట్టిన వాన

నగరంలో శనివారం రాత్రి వాన దంచికొట్టింది. సుమారు రెండు గంటల పాటు కుమ్మేసింది. భారీ వర్షానికి రోడ్లలో నీరు పొంగిపొర్లాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానికులు అవస్థలు ఎదుర్కొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సంక్షిప్త సమాచారం

27న రుక్మిణీ కల్యాణం

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 27న రుక్మిణీ కల్యాణం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం గాయత్రీ దేవాలయంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ప్రవనానంద దాస్ ప్రభు కల్యాణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు హౌసింగ్ బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయం వేదికగా వేడుకలుంటాయన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్ రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్ రెడ్డిని రెండోసారి నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం కోసం నూతన కమిటీని నియమించామన్నారు.

సమాజ సేవకులకు పురస్కారాలు

అనంతపురం కల్చరల్: వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారికి ప్రైడ్ ఆఫ్ ఇండియా, ఐకాన్ ఆఫ్ ఇండియా పురస్కారాలు అందిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ అకాడమీ వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 31లోపు దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ, డోర్ నంబర్ 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్-15' చిరునామాకు పంపాలని సూచించారు. వచ్చే నెల 17న హైదరాబాదులో అవార్డులు అందిస్తామని తెలిపారు.

సందడిగా బీబీ ఫాతిమా పీర్ల జాతర

అనంతపురం కల్చరల్: బీబీ ఫాతిమా పీర్ల జాతర చివరి రోజులకు చేరడంతో నగరంలోని ఐదోరోడ్డు మకానం పరిసరాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన పెద్ద సరిగెత్తు, పానకాల వేడుకలు భక్తి భావాన్ని చాటాయి.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అనంతపురం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ దివాకర్, సర్పంచ్ ఉదయ్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం రూరల్ పంచాయతీలో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని పంచాయతీ తీర్మానం చేశారు.

'మైక్రో ప్లాస్టిక్' అత్యంత ప్రమాదకరం

అనంతపురం ఎడ్యుకేషన్: మైక్రో ప్లాస్టిక్ వినియోగం అత్యంత ప్రమాదకరం అని ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 'మైక్రో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు' అంశంపై అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ విష్ణుప్రియ తదితరులున్నారు.

ప్రభుత్వ విద్య పట్ల నిర్లక్ష్యం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ప్రారంభమై రెన్నెళ్లు పూర్తవుతున్నా డిగ్రీ ప్రవేశాలపై ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకోకపోవడం తీవ్ర అన్యాయమని ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఉపాధ్యక్షుడు తరిమెల గిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్య పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటిదాకా డిగ్రీ ప్రవేశాలు కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగభూషణ, విజయ్, సోమశేఖర్, సాయికుమార్, విజయ్, వీరు, జయవర్ధన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

అనంతపురం అర్బన్: నిత్యజీవితంలో ప్లాస్టిక్‌ను వినియోగిస్తూ మనకు తెలియకుండానే మనం అనేక అనర్థాలను కొనితెచ్చుకుంటున్నామని డీఆర్‌ఓ ఎ. మలోల అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలోని చెత్తను అధికారులు ఉద్యోగులు తొలగించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, విభాగాల సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పట్టవా?

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. శనివారం బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు రాయుడు, ఉపాధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, దోమతెరలు, ప్లేట్లు, గ్లాసులు ఇవ్వడంతో పాటు వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంజునాథ్, సమీర్, సాయితరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభినందన సభ

అనంతపురం కల్చరల్: తెలుగు యూనివర్సిటీ విశిష్ట ప్రతిభా పురస్కారానికి ఎంపికైన డాక్టర్ శాంతినారాయణ, డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక పురస్కారానికి ఎంపికైన బండి నారాయణస్వామి, మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ సాహిత్య విమర్శ పురస్కారానికి ఎంపికైన రాజారామ్‌ను ఉపాధ్యాయభవన్‌లో సత్కరిస్తున్నట్లు 'అరసం' ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం సీనియర్ కవి ఉప్పరపాటి వెంకటేశులు,'అరసం' ప్రధాన కార్యదర్శి తన్నీరు నాగేంద్రతో కలిసి ఓ ప్రకటన విడుదల చేశారు.

ముగ్గురు అదృశ్యం

అనంతపురం: నగరంలో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వెంగమ నాయుడు కాలనీకి చెందిన వివాహిత తన కుమార్తెను రోజూ బుడ్డప్పనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో వదిలి వెళ్లేవారు. ఈ క్రమంలో శుక్రవారం పాపను అంగన్‌వాడీ కేంద్రం నుంచి తీసుకెళ్లింది. ఇంటికి కాకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు, భర్త తమ బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. ఫలితం లేకుండా పోయింది. దీంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

- కమలానగర్‌లోని ఓ దుకాణంలో రాజస్తాన్‌కు చెందిన స్వరూప్‌కుమార్ పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా దుకాణం నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- నవోదయకాలనీకి చెందిన కేశయ్య దంపతులు శారదానగర్‌లో పూల వ్యాపారం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం తీసుకురావడానికి కేశయ్య ఇంటికి వెళ్లాడు. ఎంత సేపటికీ తిరిగి రాలేదు. దీంతో భార్య ఇంటికి వెళ్లి చూడగా, అక్కడ లేడు. కుటుంబ సభ్యులతో కలిసి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పట్టపగలే చోరీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన భార్యభర్తలు రాజేంద్ర, త్రివేణి పార్వతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎర్రంపల్లి ప్రభుత్వ పాఠశాలలో రాజేంద్ర, శెట్టూరు ప్రభుత్వ పాఠశాలలో త్రివేణి చేస్తున్నారు. ఉదయం ఇద్దరూ విధులకు వెళ్లారు. ఇదే అదనుగా దొంగలు ఇంటి తాళం ధ్వంసం చేసి బీరువాలో ఉన్న 22 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఎస్ఐ యువరాజు సిబ్బందితో కలిసి ఘటనస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.